# భజంత్రీలు

-గుమ్మా నిత్యకళ్యాణమ్మ

మాధవశాస్త్రికి కొంత కాలంగా ఒక కోరిక ఉంది. అది సహజమైనదో అసహజమైనదో అతనికి తెలియదు. కాని కోరిక మాత్రం బలీయమైనది.

అలాంటి కోరిక కలగడానికి ముఖ్యంగా రెండు కారణాలున్నాయి. అతడు సారంగపాణి ఇంటి విషయాలను ప్రత్యక్షంగా చూస్తున్నాడు, వింటున్నాడు. మాధవశాస్త్రి ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లకు సారంగపాణితో పరిచయమైంది. ఆనాటి నుంచి ప్రగాఢ స్నేహితులయ్యారు ఇద్దరూ. పిల్లడికి ముందుగా పెళ్ళి చేసే అవకాశం సారంగపాణికే కలిగింది. కోడలు ఇంటిలో అడుగుపెట్టిన నాటి నుంచి సారంగపాణి, అతని భార్య సుఖసంతోషాలకు దూరమయ్యారు. ఆ కోడలు అలా ప్రవర్తించేది.

రెండో కారణం. ఇప్పుడతని కొడుకు రవీంద్ర పాతికేళ్ళవాడయ్యాడు. సంవత్సరం క్రితమే ఉద్యోగంలో చేరాడు.

"చాలా బాగుంది. ఈ మాట నా ముందు అన్నావు కాబట్టి సరిపోయింది. మరెవరి ముందో అంటే వాళ్ళు నిన్ను పరిహసిస్తారు అనే కన్నా నీలో ఏదో దుర్బుద్ధి ఉందని భావిస్తారు" అన్నాడు సారంగపాణి.

మాధవశాస్త్రి తనకలాంటి కోరిక ఎందుకు కలిగిందో చెప్పాలనుకున్నాడు. అయితే సారంగపాణి అతనికా అవకాశం ఇవ్వకుండా "పెళ్ళి చేసుకోవలసింది నీ కొడుకు, ఆ పిల్లతో కాపురం చేసేది నీ కొడుకు. ఒక్క మాట నేను ఒప్పుకుంటాను. నీ కోడలు గుణవతి, అనుకూలవతి, మంచి వంశంలో పుట్టినది కావాలని నీవు కోరుకుంటే అది తప్పుకాదు. అందచందాల విషయంలో తల్లిదండ్రులు పట్టించుకోవలసిన పనిలేదు. ఆ విషయం పెళ్ళి చేసుకోవలసిన వాడికే వదిలేయి, అదే సముచితం. 'తావలచినది రంభ' అంటారు. ఇక తతిమ్మా విషయాల ఎన్నికలో పెద్దవాళ్ళ అనుభవం ఉంటుంది. కాబట్టి వంశం మర్యాదా వీటి గురించి పెద్దవాళ్ళు తెలుసుకోగలరు. అంతేకాని వాడి భార్య ముమ్మూర్తులా ఇలా ఉండాలి అని ఆశించడం మంచి ఆలోచన కాదు" అన్నాడు సారంగపాణి.

మాధవశాస్త్రికి నవ్వు వచ్చింది. సారంగపాణి అక్కడే పప్పులో కాలు వేశాడు. ఏడెనిమిది మంది పిల్లల్ని చూసి అందులో తనకు నచ్చిన కోడల్ని ఎన్నుకున్నాడు. వంశం, మర్యాదా, గుణం... ఇలాంటి వాటికే ప్రాధాన్యత నిచ్చేనన్నాడు. కట్నం గురించి తనసలు పట్టించుకోలేదన్నాడు. వాళ్ళు ఎంత ఇస్తామని చెప్పి, ఇచ్చారో అంతతోనే తృప్తిపడ్డాడు.

"పాణీ! మన అనుభవం ప్రతిసారీ పనిచేస్తుందంటావా? ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లల్ని కాదనుకున్నావు. వాళ్ళు వీళ్ళకంటే ఎక్కువ కట్నం ఇస్తామన్నారు. నీకు ఏరి కోరి చేసుకున్న పిల్ల ఏకు మేకైంది. ఏడు తరాల వరకు మచ్చలేని వంశం వారిదన్నావు. పిల్ల సుగుణవతి అని భావించావు."

"నిజమే! అయితే ఆ దోషం అంతా ఆ పిల్లకే ఆపాదించలేం. మన బంగారం మంచిది కానప్పుడు కంసాలిని అనుకొని ప్రయోజనం ఏమిటి? కని, పెంచి, పెద్దచేసామే అనే జ్ఞానం మావాడికుండాలా! 'పెళ్ళాం బెల్లం అమ్మ అల్లం' అంటారే అలాగే మావాడు మారిపోయాడు. అంతేకాని ఆ పిల్లవాడిని మార్చింది అనను. అయినా మన భ్రమకాని, అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయా? కష్టాలూ సుఖాలూ, చీకటి వెలుగులూ ఎప్పుడూ ఉండేవే."

"నా భార్య అనుకూలవతి, అత్తమామలను గౌరవించేది. పాలలో నీళ్ళలా మాతో కలసిపోయింది. మావాడి భార్య కూడా అచ్చు నా భార్యలా ఉండాలని నేను కోరుకోవడం దుర్బుద్ధి ఎందుకౌతుంది?"

"చచ్చిపోయిన నీ భార్యను నీ కోడలిలో చూడాలనుకుంటున్నావు. అది నీ దృష్టిలో పాపం కాదు. అయితే లోకులు కాకులు. సంసార సుఖానికి ఒకటిన్నర పుష్కరాలుగా దూరమయ్యావు. ఇంకా కామవాంఛలున్నాయని, ఏవో కోరికలున్నాయని లోకం అనుకోదా? నీ కొడుకే నిన్ను తప్పుపట్టవచ్చు. అప్పుడు నీకు మనశ్శాంతి ఉంటుందా?"

తన ఆప్తమిత్రుడే తన గురించి తప్పుగా ఆలోచిస్తూ ఉంటే మాధవశాస్త్రికి దుఃఖం వచ్చింది. అది సారంగపాణి గుర్తించాడు.

"శాస్త్రీ! నా కొకటి తెలియక అడుగుతాను...." అన్నాడు శాస్త్రి ముఖంలోకి చూస్తూ.

ఏమిటి అన్నట్లు చూశాడు మాధవశాస్త్రి.

"మరేం లేదు. నీ భార్య రాధ అల్పాయుష్కురాలు. మరి కోడలు కూడా..." ఆ తరువాత మాట అనడానికి సారంగపాణికి మనస్కరించలేదు.

తన భార్య ముప్పై ఏళ్ళు నిండకుండానే చచ్చిపోయింది. తన కోడలు ముమ్మూర్తులా తన భార్యను పోలి ఉంటే ఆ పిల్ల అర్ధాయుష్షులోనే చచ్చిపోతుందని ఎందుకనుకోవాలి?

❖ ❖ ❖

మాధవశాస్త్రికి భార్య ఆలోచనలు తలపులోనికి వచ్చాయి. అలా అనడం అర్థంలేనిది. రాధ చనిపోయి అప్పుడే పద్దెనిమిదేళ్ళు గడిచిపోయాయి. ఆమె చచ్చిపోయినపుడు ఆమె శవం మీద పడి ఎంత ఏడ్చాడో అంతగా ఇప్పుడూ కుమిలిపోతూనే ఉన్నాడు.

"రాధా! నీలాంటి భార్య దొరకడం నేను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం" అనేవాడు భార్యతో.

"మీరు పొరపడుతున్నారు. ఆ మాట అనవలసింది నేను. పూజ కొద్ది పురుషుడు దానం కొద్ది బిడ్డలు అంటారు. నేను గత జన్మలో చేసిన పుణ్య ఫలితమే నా భర్యగా మీరు ఈ జన్మలో దొరికారు" అనేది కిలకిల నవ్వుతూ రాధ.

ఇద్దరూ అలవోకగా కాస్సేపు నా అదృష్టం అంటే నా భాగ్యం అని వాదులాడుకునేవారు. అంతలోనే ఇద్దరూ ఒక్కటైపోయేవారు. రాధ తన అందాలను భర్త ముందుంచేది జుర్రుకోమంటూ. అతను ఆలస్యం చేస్తాడా? పైగా అదృశ్యంగా మదనుడు వేసు పూల బాణాలు.

ఆ ఇల్లే స్వర్గం, ఆ ఇల్లే నందనవనం. వాళ్ళు రతీ మన్మథులు.

"రాధా! రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనకలు నీ కాలి గోటికి సరితూగరు" అంటాడు శాస్త్రి.

"ఏమన్నారు? వీళ్ళందరినీ చూశారా మీరు? ఇంకా ఏం చేశారు వాళ్ళతో? నా మొగుడు శ్రీరామ చంద్రమూర్తి అనుకున్నాను. మొత్తానికి మాధవుడని మీ వాళ్ళు పేరు పెట్టినందుకు ఆ పేరు నిలబెట్టుకుంటున్నారా?" అంటూందామె.

ఆ సుఖాలు క్షణికమే అయినా శాస్త్రిలో చెరగని ముద్ర వేసుకున్నాయి.

మాధవశాస్త్రి తల్లిని ఎంతగానో ఆదరిస్తాడు. ఆమె కొడుకు మీద వాత్సల్యం ఎంత గుమ్మరిస్తుందో అతడి తల్లి ప్రేమను అంతగా ఆమెకందిస్తాడు.

"బాబూ! ఇంకా పెళ్ళి చేసుకోవా?" అని తల్లి అంటే శరీరం పులకరించినా ఏదో బాధ ఆ శరీరాన్ని కలచి వేసింది.

తన పెళ్ళి ఆమె కష్టాలకు కారణం కారాదు. ఆమె దుఃఖించకూడదు. తండ్రి కరువైన తనను అలరారు ముద్దుగా పెంచింది. తన భార్య వస్తే ఆమె తన తల్లిని ఆదరిస్తుందా?

తల్లి ఎన్నిక సరియైనదే!

రాధలో అన్ని గుణాలూ సమతూకంలో ఉన్నాయి.

విధిలీలలు విచిత్రంగా ఉంటాయి.

రాధ పండంటి మనవడ్ని అత్తగారికిచ్చింది.

"అత్తయ్యగారు! మీ కోరిక తీర్చేను. ఇదిగో మను మదు. ఎలా పెంచుకుంటారో?" అంది నవ్వుతూ రాధ.

కొడుకు పుట్టేదన్న సంతోషంతో కోడలు ఆ మాట అందని శాస్త్రి తల్లి అనుకుంది. కాని అందులో వేరొక

## కవితా వసంతం

సిరులొలుకు సినారెకు వచ్చాయి
డెబ్బది ఏడు వసంతాలు
కవితలొలుకు కామధేనువు నుండి వచ్చాయి
డెబ్బది ఏడు సంపుటాలు
ఐనా తగ్గలేదు భావుకత్వం
వ్రాస్తూనే ఉన్నాడు రమ్య కవిత్వం
పాడినా సాటిలేదు గాన గంధర్వుడే
అధ్యక్షుడిగా సాటిలేదు అఖిల జగన్నాయకుడే
సకల విశ్వంలో మానవ చరిత్రను
విశ్వంభరగా రేకెత్తించిన
పదకవితా మాయాజాల మహర్షి సినారె
గురువుగా భావించిన వారికి తెలియనివి చెప్తూ
లేఖలు వ్రాసే వారిని సైతం ప్రోత్సహిస్తూ
ఉండే మహోన్నత కవితామూర్తి సినారె
విశ్వంలో పుట్టి విశ్వంభరతో జ్ఞానపీఠం
కైవసం చేసుకున్న విశిష్ట వ్యక్తి వక్త సినారె
గర్వం కోపం లేని కోమల స్వరూపుడు సినారె
కవిత్వమనే అమృతం తాగి
కలకాలం చిరునవ్వులతో వెల్గాలి
మృత్యుంజయుడిగా మానవజాతిలో
మణిరత్నమై మెరవాలి
కవితలల్లే వారికి ఆశాకిరణం కావాలి

–?

అర్థం ఉంటుందని ఆమె ఊహించలేదు. రవీంద్రకు ఏడేళ్ళు నిండనే లేదు తమందరిని వదిలేసి రాధ తన దారి చూసుకుంది. రాధే తన సర్వస్వం అని భావించిన శాస్త్రి ఎవరెంత బలవంతపెట్టినా మరో పెళ్ళి చేసుకోలేదు.

❖ ❖ ❖

రవీంద్రకు పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి.

సారంగపాణి అన్నట్లు పెళ్ళి చేసుకోవలసినది వాడు. కాబట్టి వాడి అభిప్రాయం కనుక్కోవడం ముఖ్యం అనుకున్నాడు మాధవశాస్త్రి.

వాడు రాధ కొడుకనిపించుకున్నాడు.

"నాన్నా! తాతగారు వాళ్ళ అమ్మా నాన్నలు ఎంపిక చేసిన నాయనమ్మను చేసుకున్నారు. నువ్వేమో మీ అమ్మగారికి నచ్చిన పిల్లను చేసుకున్నావు. మిగతా అయిదు తరాల సంగతి నాకు తెలియదు. నేను మీ అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నాను. నా అభిరుచులు ఇష్టాయిష్టాలు మీకు కాక వేరెవరికి తెలుస్తాయి?"

ఓ రెండు సంబంధాలు చూసివచ్చాడు. ఆ పిల్లలతో తాను కోరుకున్న లక్షణాలు కొన్ని కూడా లేవు వాళ్ళకేదో సమాధానం చెప్పి వచ్చేసాడు.

"శాస్త్రీ! ఇతను వరప్రసాదరావు గారు తాడేపల్లి గూడెం నుంచి నన్ను వెతుక్కుంటూ వచ్చేరనే కన్నా నీ ఇంట్లో పెళ్ళికొడుకు ఉన్నాడని తెలిసి కలియాలని వచ్చారు. మా మామయ్యగారి పెద్ద కొడుకు ఇతడ్ని నా దగ్గరకు పంపించాడు" అన్నాడు సారంగపాణి.

అతను నమస్కారం పెట్టాడు.

"మరేనండి, సుందరమూర్తిగారు వెళ్ళమని మరీ మరీ చెప్పారు పెళ్ళి కుమార్తె నా కూతురు కాదు. నా స్నేహితుడు పాండురంగారావు గారి కూతురు" అన్నాడు వరప్రసాదరావు.

"మీరొక్కరే వచ్చారేం? వారు కూడా వస్తే బాగుండేది కదా?" అన్నాడు మాధవశాస్త్రి.

"అయ్యో! మీకెలా చెప్పను? అతను ఆరు నెలల క్రితం చనిపోయారు. ఏడాదిలోగా ఆడపిల్ల పెళ్ళి చేస్తే తన భర్తకు కన్యాదాన ఫలం దొరుకుతుందని పాండురంగారావు భార్య తెగ ఆరాటపడుతున్నది. ఇంతలో మీ విషయం తెలిసి రెక్కలు కట్టుకుని వాలేను."

"అయ్యో! పెళ్ళీడుకొచ్చిన పిల్ల ఉండగా అతను చనిపోయాడా? ఆమెకెంత కష్టం వచ్చింది?" అన్నాడు మాధవశాస్త్రి.

"ఆవిడకిద్దరు ఆడపిల్లలు. మగపిల్లలు లేరు."

"శాస్త్రీ! మావాడు ఉత్తరం రాసి ఇతడ్ని నా దగ్గరకు పంపించాడు ఆడపిల్లవాళ్ళు పెద్దగా ఉన్నవాళ్లు కాదట. నువ్వు నీ కొడుకు పెళ్ళి తొందరలో చేయాలనుకుంటున్నావు. పిల్లను చూసిరావడంలో నష్టం లేదు. అయితే శాస్త్రీ నేనోమాట చెప్తాను. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు. వీళ్ళ గురించి నాకేమీ తెలియదు" అన్నాడు సారంగపాణి గోడమీద పిల్లి వాటంగా.

పిల్లను చూసి వస్తే నష్టంలేదు అనుకున్నాడు. వాళ్ళ విషయాలు అక్కడకు వెళ్ళకుండా తెలియవుగా? "వాణీ! మరింత దూరం మన మీద ఆశపెట్టుకొని వచ్చారు. నీవన్నట్లు పిల్లను చూసిరావడం మంచిది అయితే నీవూ నీ భార్యా మాతోపాటు రావాలి" అని లంకెపెట్టాడు మాధవశాస్త్రి.

"నిక్షేపంలా వస్తాం. నా భార్యకు పెద్దరికం ఇస్తున్నావంటే ఆమె చంగున పరిగెత్తుకొని వస్తుంది" అన్నాడు సారంగపాణి. వెంటనే సారంగపాణి పంచాంగం చూసి పెళ్ళి చూపులకు ముహూర్తం పెట్టాడు.

"ఆ రోజున వస్తాం. ఒకవేళ ఏదైనా అవాంతరం వస్తే మీకు ముందుగా ఫోను చేస్తాను" అని చెప్పి మాధవశాస్త్రి అతని ఫోను నెంబరు డైరీలో రాసుకున్నాడు.

❖ ❖ ❖

సారంగపాణి దంపతులను కొడుకును తీసుకుని అనుకున్న రోజునే తాడేపల్లిగూడెం వెళ్ళి సుందరమూర్తి ఇంటిలో దిగారు. అక్కడే కొన్ని ప్రాథమిక విషయాలు సేకరించారు.

వరప్రసాదరావు వచ్చి ఆడపిల్ల వారింటికి వీరిని తీసుకెళ్ళాడు.

పెళ్ళిచూపుల కార్యక్రమం మొదలైంది.

ఆ పిల్లను చూస్తూనే గతుక్కుమన్నాడు మాధవశాస్త్రి.

ఆరేడు నెలల కిందటి సంగతి అతనికి గుర్తుకొచ్చింది.

మాధవశాస్త్రి ఏదో పనిమీద విజయవాడ వెళ్ళాడు. ఒక స్నేహితుని కలిసి సాయంత్రం అయిదు గంటల సమయంలో తను దిగిన హోటల్‌కి టెంపోలో వెళ్తున్నాడు. దారిలో ఒక అమ్మాయి టెంపో ఎక్కింది. తనకు ఏభై ఏళ్ళు దగ్గరకు వస్తున్నా ఆమె నుంచి చూపుల్ని మరల్చుకోలేకపోయాడు. మెడలో పసుపు

తాడు, నల్లపూసల పేరు, ఒంటిపేట గొలుసు ఉన్నాయి. ఆకుపచ్చ రంగు బోర్డరున్న గులాబీ రంగు చీర, మేచింగ్ బ్లౌజు వేసుకుంది. ముఖం గుండ్రంగా నిండుగా ఉంది. ఆమెను చూడగానే రాధ అతని కళ్ళ ముందు మెదిలింది. చిన్న చిన్న తేడాలు లేవని కాదు ఆ పిల్ల తన పెళ్ళినాడు రాధ ఎలాగుండేదో అలాగే వుంది. ఆ పిల్ల ఏం తలచుకుంటున్నదో మనసులోనే ముసిముసిగా నవ్వుకొంది. అంతే ఆ పసిడి బుగ్గమీద సొట్ట పడింది. మాధవశాస్త్రి రెప్పలు వాలడంలేదు. అతను తనను తదేకంగా చూడడం ఆ పిల్ల పసిగట్టింది. వెంటనే సరిగ్గా ఉన్న పైటను మరోమారు సర్దుకొని మరోపక్క చూడసాగింది.

మాధవశాస్త్రి బాధపడ్డాడు. తన దురదృష్టం ఈ పిల్లకు పెళ్ళైంది. లేకుంటే వంశం, మర్యాద, జాలి, కులం అనేవేవీ పట్టించుకోకుండా ఆమెను కోడలిగా తన ఇంటికి తెచ్చుకునేవాడు.

ఆ తరువాత వారం పది రోజుల వరకు ఆ పిల్లను మరచిపోలేకపోయాడు.

ఇప్పుడు తన కళ్ళ కెదురుగా పెళ్ళికూతురు ముస్తాబులో ఆ పిల్ల ఉంది. లేదా ఆ పిల్ల పోలికలు కొట్టొచ్చినట్లున్న పిల్ల. బేధమల్లా మెడలో పసుపుతాడు లేదు. నల్లపూసలు లేవు. రెప్ప వాల్చకుండా కొన్ని క్షణాలు ఆమెనే చూస్తూ శిల అయిపోయాడు.

"మీకు ఇద్దరు పిల్లలని వరప్రసాదరావు గారు చెప్పారు. వాళ్ళు కవలలా?"

"అబ్బే కవలలు కారు. ఇద్దరి మధ్యా మూడేళ్ళ అంతరం ఉంది."

"అలాగా! ఈ పిల్ల మీ రెండో కూతురా? పెద్ద పిల్లకు పెళ్ళి అయిందా? పెళ్ళి అయినట్లు మాకు చెప్పలేదు."

"వరప్రసాదరావు అన్నయ్య మీకు వివరాలు చెప్పలేదా? ఇదే మా పెద్దపిల్ల లావణ్య. రెండోది ఇంకా కాలేజీలో చదువుతోంది."

వ్యక్తిని పోలిన వ్యక్తులుండడం అసంభవం కాకపోవచ్చు. కాని తన కళ్ళు తనను మోసం చెయ్యలేవు. ఆనాడు గృహిణి వేషంలో చూసింది ఈ పిల్లనే. పెళ్ళి అయిన పిల్లకు మళ్ళీ పెళ్ళి చేయాలని వీరెందుకు అనుకుంటున్నారు? భర్తకు విడాకులిచ్చిందా? ఇందులో ఏదో మోసం వుంది. సారంగపాణి ముందుగానే వార్నింగు ఇచ్చాడు, వీళ్ళ గురించి తనకు బొత్తిగా తెలియదని.

మాధవశాస్త్రి రవీంద్ర వంక చూశాడు. రవీంద్ర ఆ పిల్లను నచ్చుకున్నాడన్న నిదర్శనంగా వాడి ముఖంలో ఆనంద రేఖలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఈ పిల్లలో మీ స్నేహితుని భార్య రాధ పోలికలున్నాయి కదండీ?" అని మెల్లగా అంటోంది సారంగపాణి భార్య.

## పెన్నిధి

నేనూ శ్రీమంతుడినే - సంపన్నుడినే
నాకున్న సంపదల్లో కొన్ని...
అంతులేని ఆకలి - అనంతమైన చీకటి
అనివార్య కాటకం - అపరిష్కృత వ్యధ.
నాకున్న అతి పెద్ద కోరిక-?
పేదరికపుటంచు దాటటం-
సామాన్యుడిగానైనా బతకగలగటం!
అనునిత్యం ఈ ఆశ... ఎదగుచ్చే కంటకం
భేదాన్ని గ్రహించటం
బాధని సహించటం
సహనాన్ని వహించటం
భవిష్యత్తునూహించటం
ఎంతకాలమైనా... ఇంతేనా?
ఎదుటి వారిని చూసి ఏడుస్తూ
మొదటి ఆరిని చూసి నిందిస్తూ
వేలెత్తి చూపే వారిని ద్వేషిస్తూ
వేధించి, మోదించే వారిని దూషిస్తూ
ఎన్ని తరాలైనా... బతికేదిలాగేనా???
కరుడు గట్టిన సంఘపు
కఠిన నియమాలు,
విరుగుడు లేని ధన-మద
వికటాట్టహాసాలు-
వీటినన్నిటినీ విదిల్చెయ్
క్రోధ లోభ మయ ప్రపంచ-
వృత్తపు రేఖ దాటి బయటకు రా!
నిజాయితీగా నిన్ను నువ్వు దిద్దుకో
నీ శక్తిమేరకు దౌర్భాగ్యాన్ని రూపు మాపే
దృఢత్వాన్ని పెంపొందించుకో!
దిగ్విజయమనే పెన్నిధి పొందుతో
ప్రగతి శిఖరాగ్రాన్నందుకో!

-ఆచంట హైమవతి

"క్షమించండి, మేమీ సంబంధం చేసుకోలేం" అన్నాడు మాధవశాస్త్రి.

రవీంద్ర తండ్రి మాటలు విని దిగ్భ్రాంతి చెందాడు.

సారంగపాణి దంపతులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పెళ్ళి కూతురు లక్షణంగా ఉంది. రవీంద్రకు బాగా నచ్చింది. పైగా శాస్త్రి అభిలషిస్తున్న కోరక మేరకు ఆ పిల్లలో రాధ పోలికలున్నాయి. మరి శాస్త్రి అంత ఖరాఖండిగా ఎందుకన్నాడు? సారంగ పాణికి మింగుడు పడలేదు.

"అన్నయ్యగారు! బలవంతంలేదు. ఎందుకు ఇష్టపడటంలేదు అన్న కారణం అడగడం సమంజసం కాదు. మీరు మా స్థితిగతులను గమనించి పెద్దగా కట్నం ఇవ్వలేం అనుకుంటున్నారేమో? ఆ సంగతి మీకు రంగన్నయ్య ముందే చెప్పానన్నాడు." ఆమెకు దుఃఖం వచ్చింది. దుఃఖాన్ని ఆపుకుంటూ ఎంతో ప్రయత్నం మీద తడబడుతూ ఆ నాలుగు ముక్కలు అంది.

"శాస్త్రీ! నీవు తెలివితోనే ఉన్నావా? పిల్లలో ఎలాంటి వంకలూ లేవు. మరి నీకు నచ్చకపోవడానికి కారణం తెలుసుకోవాలని నాకు వుంది."

"అన్నయ్యగారు! వారిని ఇరుకున పెట్టడం ఎందుకు? ఈ సంబంధం మాకు ఇష్టంలేదని వారు స్పష్టంగా చెప్పారు. అయినా ఎవరికెక్కడ రాసిపెట్టి ఉందో?" ఈ పర్యాయం లావణ్య తల్లి తొణుకు బెణుకు లేకుండానే అంది.

"కారణం...? మీకు తెలియదా? నా చేత చెప్పించాలనుకుంటున్నారా?"

ఇప్పుడు వరప్రసాదరావు గారు కల్పించుకున్నారు.

"కారణం మాకు తెలిస్తే అడుగుతామా? మీకు చెప్పాలని లేకపోతే బలవంతం లేదు. మేం మళ్ళీ పెళ్ళిచూపులకు సన్నద్ధం కావాలిగా. మా వలన ఏమైనా పొరపాట్లు జరిగితే ముందుందు ఆ పొరపాట్లు దొర్లకుండా చూస్తాం."

"మమ్మల్ని మీరెందుకు మోసం చేయాలను కున్నారు? ఈ పిల్లకు లోగడే పెళ్ళి అయింది. ఆరేడు నెలల క్రితం విజయవాడలో నేను చూశాను. అప్పుడీమె మెడలో నల్లపూసలు, పసుపుతాడూ వున్నాయి."

"మీరు చెప్తున్నది నాకు బొత్తిగా అర్థం కావడం లేదు. మా పిల్లకు పెళ్ళి అయిందా?"

"అంతా దగా, మోసం!" అన్నాడు శాస్త్రి.

"శాస్త్రీ! నువ్వెవరినో చూసి ఆమె ఈ పిల్ల అనుకుంటున్నావు. ఒకమారు పెళ్ళి అయిన పిల్లకు వీళ్ళు మళ్ళీ పెళ్ళి చేయాలని తలపెడతారా?"

పెళ్ళికూతురు చివాలున లేచి వెళ్ళింది. ఎంత తొం దరగా వెళ్ళిందో అంతే తొందరగా అయిదు నిముషాల్లో వచ్చింది.

"అమ్మా! వారంటున్నది దోషరహితమైనదే. అప్పుడు వారు నన్నీ వేషంలోనే చూశారు" అంది.

ఆమె మెడలో పసుపుతాడు, నల్లపూసలు ఉన్నాయి. కాళ్ళకు మట్టెలున్నాయి.

"నేను టెంపరరీగా విజయవాడలో ఉద్యోగం చేస్తున్నాను. వర్కింగ్ వుమెన్స్ హాస్టలులో ఉంటున్నాను. పెళ్ళికాని పిల్ల పరాయి ఊర్లో ఉద్యోగం చేస్తూ ఒంటరిగా ఉంటే ఎలాంటి కష్టాలు అనుభవించవలసి వస్తుందో వారం పది రోజుల్లో గ్రహించాను. జీవితమే ఒక నాటక రంగం, మనమంతా పాత్రధారులం. ఆ కష్టాల నుంచి గట్టెక్కడానికి ఒక స్నేహితురాలి సలహా మేరకు ఈ వేషధారణ చేశాను. నాకు పెళ్ళి అయిందని, నా భర్త తాడేపల్లిగూడెంలో ఎస్.ఐ. అని, ఒకటి రెండు నెలల్లో ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారని చెప్పాను. అలా అబద్ధం చెప్పి నా శీలాన్ని కాపాడుకుంటూ వస్తున్నాను. ఈ విషయం ఇక్కడున్న నా తల్లికి కూడా తెలియదు" అంది లావణ్య.

మాధవశాస్త్రి నోట మాట రాలేదు.

"ఆడదానికి రక్షణ లేని ఈ సమాజంలో ఆడదే తనను తను రక్షించుకోవాలి. నేను చేసింది తప్పం టారా?" అడిగింది లావణ్య.

అక్కడ ఒక్క క్షణంలో హర్షోల్లాసాలు తావు చేసు కున్నాయి.

మాధవశాస్త్రికి తను కోరుకున్న లక్షణాలు గల పిల్ల కోడలుగా దొరికింది.

ఇంక బాజా భజంత్రీలు మ్రోగడమే తరువాయి. ■

## అందం

ఆకుల / కోక జారవిడిచిన
రావి కన్య / దిగంబరంగా
దర్శనమిచ్చి / చిగురాకుల
కొత్త కోక చుట్టుకుంది
అందంగా.

–సింగిడి రామారావు